
# తరచూ కడుపుబ్బరం.. నాలుగు వ్యాధులకు సంకేతం!



చాలామంది తరచూ తిన్న తర్వాత లేదా కొన్ని సందర్భాల్లో అనుకోకుండా కడుపు ఉబ్బరం సమస్య ఎదుర్కొంటున్నారు. ఇందుకు గ్యాస్ సమస్యే కారణమని అనుకోవడం సహజం. అయితే, తరచూ ఇదే సమస్య పదే పదే తిరగబెడుతూ ఇబ్బంది పెడుతుంటే కచ్చితంగా జాగ్రత్త పడాల్సిందే. ఎక్కువ తినకపోయినా కడుపు ఉబ్బినట్లుగా అనిపిస్తుంటే అది కొన్ని తీవ్రమైన వ్యాధులకు సంకేతం కావచ్చు. కొన్నిసార్లు అపానవాయువు శరీరంలో జరుగుతున్న అంతర్గత మార్పుల గురించి హెచ్చరిస్తుంది. వీటిని విస్మరిస్తే భవిష్యత్తులో హానికరం కావచ్చు. కాబట్టి, ఈ లక్షణాలు ఉంటే వెంటనే చికిత్స తీసుకోండి.

కడుపు ఉబ్బరం అనేది చాలా మందిని ఏదో ఒక సమయంలో ఇబ్బంది పెట్టే ఒక సాధారణ సమస్య. మనం తరచుగా దీనిని గ్యాస్ లేదా చెడు ఆహారపు అలవాట్ల ఫలితంగా ఇలా జరుగుతుందని భావిస్తాము. భారీ ఆహారం తినకపోయినా ఈ సమస్య పదే పదే వస్తుంటే ఆలోచించాల్సిందే. ఇంటి నివారణలు ఉపశమనం కలిగించకపోయినా కొన్నిసార్లు కడుపు ఉబ్బినట్లు అనిపిస్తుంది. ఇది ఏదైనా తీవ్రమైన వ్యాధికి సంకేతం కూడా కావచ్చు.

**కడుపు ఉబ్బరం ఈ వ్యాధుల లక్షణం కావచ్చు**

పదే పదే కడుపు ఉబ్బరం అనేక వ్యాధులకు కారణమవుతాయని డాక్టర్లు అంటున్నారు. వాటిలో ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ ఒక ప్రధాన వ్యాధి. ఇది పేగులకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్య. ఈ వ్యాధి ఉన్నవారిలో వ్యక్తి పదే పదే కడుపులో తిమ్మిరి, గ్యాస్, విరేచనాలు లేదా మలబద్ధకం, ఉబ్బరం ఉంటుంది. IBSకి ఒకే కారణం ఉండాలని రూలేం లేదు. కానీ ఒత్తిడి, పేలవమైన ఆహారపు అలవాట్లు, నిద్ర లేకపోవడం, హార్మోన్ల అసమతుల్యత దీనికి కారణమవుతాయి. IBS ఉన్నవారిలో తిన్న వెంటనే వాయునాళాలు రియాక్ట్ అవుతాయి. ఈ పరిస్థితి కొన్నిసార్లు చాలా అసౌకర్యానికి గురిచేస్తుంది.

**లాక్టోజ్ జీర్ణం చేసుకోలేకపోవడం**

ఇది పాలు, పాల ఉత్పత్తులను సరిగ్గా జీర్ణం చేసుకోలేని వ్యక్తులలో సంభవిస్తుంది. వాస్తవానికి లాక్టోజ్ అనేది పాలలో కనిపించే ఒక రకమైన చక్కెర. దీనిని జీర్ణం చేయడానికి లాక్టేజ్ అనే ఎంజైమ్ అవసరం. ఈ ఎంజైమ్ శరీరంలో ఉత్పత్తి కాకపోతే పాలు తాగిన తర్వాత ఉబ్బరం, కడుపు నొప్పి, విరేచనాలు లేదా గ్యాస్ వంటి సమస్యలు మొదలవుతాయి. భారతదేశంలో చాలా మందికి దీని గురించి తెలియదు. వారు దీనిని సాధారణ గ్యాస్ అని భావించి విస్మరిస్తూ ఉంటారు.

**ఫ్యాటీ లివర్**

ఫ్యాటీ లివర్ లేదా లివర్ సిర్రోసిస్ వంటి ఏదైనా కాలేయ సంబంధిత వ్యాధి కావచ్చు. కాలేయ పనితీరు తగ్గినప్పుడు శరీరంలో టాక్సిన్స్ పేరుకుపోవడం ప్రారంభమవుతుంది. కడుపు నీటితో నిండిపోవడం మొదలవుతుంది. దీనిని వైద్య భాషలో అసైట్స్ అని పిలుస్తారు. ఈ స్థితిలో కడుపు ఉబ్బడమే కాకుండా గట్టిగా అనిపిస్తుంది. అలాగే, అలసట, వాంతులు, ఆకలి లేకపోవడం, చర్మం లేదా కళ్ళు పసుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి.

**అండాశయ సమస్యలు**

మహిళల్లో అండాశయ సమస్యలు , అండాశయ తిత్తులు లేదా PCOS వంటివి. ఒక మహిళ ప్రతి నెలా ఉబ్బరం అనుభవిస్తే క్రమరహిత ఋతుస్రావం, ముఖంపై మొటిమలు లేదా బరువు పెరుగుట వంటివి ఉంటే ఇవి అండాశయాలలో మార్పులు లేదా హార్మోన్ల అసమతుల్యతకు సంకేతాలు కావచ్చు. అండాశయ తిత్తులు ఉబ్బరంతో పాటు కడుపులో బరువు, నొప్పిని కలిగిస్తాయి.

మీకు కడుపు ఉబ్బరం, ఆకలి లేకపోవడం, వాంతులు, అకస్మాత్తుగా బరువు తగ్గడం లేదా కడుపులో గట్టిదనం వంటి లక్షణాలు నిరంతరం ఉంటే దానిని తేలికగా తీసుకోకండి. ఇది కేవలం గ్యాస్ కాకపోవచ్చు. కానీ ఏదైనా తీవ్రమైన వ్యాధి లక్షణం కావచ్చు. అటువంటి పరిస్థితిలో మీకు మీరే చికిత్స చేసుకునే బదులు వైద్యుడి వద్దకు వెళ్లి తనిఖీ చేయించుకోవడం మంచిది.

# మడమల పగుళ్లతో ఇబ్బంది పడుతున్నారా?

## ఈ నివారణలను ట్రై చేస్తే పగుళ్లు మాయం!

ఇంటర్నెట్ డెస్క్: వర్షాకాలంలో అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా, పెరిగిన తేమ, నీటి నిల్వలు.. బ్యాక్టీరియా, వైరస్లు, ఇతర సూక్ష్మక్రిములు వృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని సృష్టిస్తాయి. దీని వలన అంటువ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా వర్షాకాలంలో చర్మం, ముఖ్యంగా మడమలు ఎక్కువగా ప్రభావితమవుతాయి.

పగిలిన మడమల వల్ల నొప్పి రావడమే కాకుండా నడవడం కూడా ఇబ్బంది అవుతుంది. మీరు కూడా ఇలాంటి సమస్యతో బాధపడుతున్నారా? అయితే, ఇక ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే వర్షాకాలంలో మడమల నివారణకు కొన్ని సులభమైన, ప్రభావవంతమైన ఇంటి నివారణలు ఉన్నాయి. ఇవి ట్రై చేస్తే నొప్పి, పగుళు రెండూ మాయమవుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఆ నివారణలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..



**గోరువెచ్చని నీటిలో**

గోరువెచ్చని నీటిని తీసుకోండి. అందులో కొద్దిగా ఉప్పు, కొన్ని చుక్కల నిమ్మరసం కలపండి. తర్వాత మీ పాదాలను ఈ నీటిలో 15-20 నిమిషాలు ఉంచండి. ఇలా చేయడం వల్ల క్రమంగా మడమల నొప్పి, పగుళ్లు తగ్గుతాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

**కలబంద జెల్**

పగిలిన మడమలకు కలబంద మొక్క చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రాత్రి పడుకునే ముందు మడమలపై కలబంద జెల్‌ను పూయండి. రాత్రంతా అలాగే ఉంచండి. కలబంద జెల్ సహజమైన మాయిశ్చరైజింగ్, వైద్యం లక్షణాలను కలిగి ఉంటుంది. కాబట్టి, ఇది త్వరగా మడమల పగుళ్లను తగ్గేలా చేస్తుంది.

**తేనె**

తేనె మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. కానీ వర్షాకాలంలో పగిలిన మడమలకు కూడా తేనె ప్రభావవంతంగా ఉంటుందని మీకు తెలుసా? గోరువెచ్చని నీటిలో తేనె కలిపి పాదాలను ఆ నీటిలో కాసేపు ఉంచితే పగిలిన మడమలు త్వరగా నయం అవుతాయని ఆయుర్వేద నిపుణులు సూచిస్తున్నారు.

**అరటిపండ్లు**

వర్షాకాలంలో పగిలిన మడమల కోసం అరటిపండ్లను ఉపయోగించవచ్చు. అరటిపండును మెత్తగా చేసి మడమల మీద పూయడం వల్ల పగిలిన మడమలు మృదువుగా మారుతాయి. ఇది నొప్పిని కూడా తగ్గిస్తుంది.

**కొబ్బరి, పసుపు మిశ్రమం**

కొబ్బరి, పసుపు మిశ్రమం పగిలిన మడమలకు మంచి ఇంటి నివారణ అని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. కొబ్బరి నూనె చర్మాన్ని తేమ చేస్తుంది. పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇది పగిలిన మడమలను నయం చేయడంలో సహాయపడుతుందని చెబుతున్నారు.






# ఎల్ఐసీలో నెలకు రూ.10 వేల పెట్టుబడి..

## 10 ఏళ్ల తర్వాత ఎంత వస్తుంది, ట్యాక్స్ ప్రయోజనాలేంటి?




మీరు గ్యారంటీడ్ సేవింగ్స్ కోసం ప్లాన్ చేస్తున్నారా. అలాంటి వారి కోసం LIC లో జీవన్ ఉత్సవ్ పాలసీ ఉంది. దీనిలో మీరు మీ స్థాయిని బట్టి నెలకు ఎంతో కొంత ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ స్కీంలో ఇన్వెస్ట్ చేయడం వల్ల ట్యాక్స్ ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ఆ వివరాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఈ స్కీంలో మీరు ప్రతి నెల రూ. 10,000 చొప్పున 10 ఏళ్లపాటు ఇన్వెస్ట్ చేస్తే, రిటైర్మెంట్ సమయానికి మీకు దాదాపు రూ.63.6 లక్షలు లభిస్తాయి. ఇక్కడ మీరు 10 ఏళ్లలో చెల్లించేది కేవలం రూ.12 లక్షలు మాత్రమే. కానీ మీకు వచ్చేది మాత్రం దాదాపు ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుంది.

**ప్రతి సంవత్సరం కూడా..**

మీరు 30 ఏళ్ల వయసులో జీవన్ ఉత్సవ్ పాలసీ తీసుకుంటే, మీరు ప్రతి సంవత్సరం రూ.1.2 లక్షలు చెల్లించి 10 ఏళ్లలో రూ. 12 లక్షలు చెల్లిస్తారు. 11వ సంవత్సరం నుంచి, ప్రతి సంవత్సరం దాదాపు రూ. 3.5 లక్షల వరకు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ పొందవచ్చు. లేదా ఒకేసారి కూడా మీ అవసరాన్ని బట్టి మొత్తం డబ్బును తీసుకోవచ్చు. మొత్తం లైఫ్ టైమ్‌లో ఈ ఇన్‌కమ్ వల్ల రాబడిగా రూ.60 లక్షల కన్నా ఎక్కువ వస్తుంది.

**జీవన్ ఉత్సవ్ పాలసీ అంటే ఏంటి?**

LIC జీవన్ ఉత్సవ్ అనేది ఒక గ్యారంటీడ్ లైఫ్ ఇన్సూరెన్స్ సేవింగ్స్ ప్లాన్. దీని ప్రత్యేకత ఏంటంటే, ఇది ఒక నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్ పాలసీ. అంటే, ఇది షేర్ మార్కెట్ మీద ఆధారపడదు. అలాగే లాభాల్లో పాలసీహోల్డర్‌కు వాటా ఉండదు. కానీ, దీనిలో గ్యారంటీడ్ ఇన్‌కమ్ ఉంటుంది. అంటే మీరు పెట్టే డబ్బుకి నిర్ణీత శాతం రాబడి వస్తుంది.

**ఇది ట్యాక్స్ సేవింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కింద వస్తుందా?**

ఈ పాలసీ కోసం చెల్లించిన ప్రీమియంలు, రైడర్ ప్రీమియంలతో సహా, ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80C కింద పన్ను మినహాయింపుకు అర్హత కలిగి ఉంటాయి. సెక్షన్ 80C కింద ఒక ఆర్థిక సంవత్సరంలో గరిష్టంగా రూ. 1.5 లక్షల వరకు మినహాయింపు పొందవచ్చు. ఈ మినహాయింపు పొందాలంటే, వార్షిక ప్రీమియం సొమ్ము అసలు మొత్తంలో 10% కంటే తక్కువగా ఉండాలి.

**సెక్షన్ 10(10D) కింద..**

ఈ పాలసీ కింద చెల్లించబడే డెత్ బెనిఫిట్ (పాలసీదారు మరణం సంభవించినప్పుడు చెల్లించబడే మొత్తం) సెక్షన్ 10(10D) కింద పూర్తిగా పన్ను రహితంగా ఉంటుంది. అదే విధంగా, సర్వైవల్ బెనిఫిట్స్ (రెగ్యులర్ ఇన్‌కమ్ బెనిఫిట్ లేదా ఫ్లెక్సీ ఇన్‌కమ్ బెనిఫిట్) కూడా సెక్షన్ 10(10D) కింద పన్ను రహితంగా ఉంటాయి. కానీ ఇది కొన్ని షరతులకు లోబడి ఉంటుంది.

**రూ.5 లక్షల కంటే ఎక్కువ ఉంటే..**

వార్షిక ప్రీమియం సొమ్ము సొమ్ము అసలులో 10% కంటే తక్కువగా ఉండాలి. 01.04.2023 తర్వాత తీసుకున్న పాలసీలకు, వార్షిక ప్రీమియం రూ.5 లక్షల కంటే ఎక్కువ ఉంటే, ఆదాయం పన్ను రహితంగా ఉండకపోవచ్చు. ప్రీమియంలపై వర్తించే GST లేదా ఇతర చట్టబద్ధమైన పన్నులు అదనంగా వసూలు చేయబడతాయి. ఇవి పన్ను మినహాయింపు పరిధిలోకి రావు.

# ఐటీఆర్ ఫైల్ చేస్తున్నారా..?

## ఈ తప్పులు మాత్రం చేయకండి




ప్రస్తుతం ఐటీఆర్ ఫైలింగ్ క్రమంగా కఠినమవుతోంది. ఎందుకంటే ఐటీ శాఖ నిబంధనలను కఠినంగా అమలు చేస్తోంది. కాబట్టి చిన్న పొరపాట్ల వల్ల కూడా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ప్రధానంగా Section 139(9) కింద Defective Return అంటూ నోటీసులు వస్తున్నాయి. ఇలా జరిగితే మీ రిఫండ్ ఆలస్యం, జరిమానా వేయడం వంటివి జరుగుతాయి. కాబట్టి దాఖలు చేసే ముందు చిన్న చిన్న తప్పులు చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఐటీఆర్-1 సాధారణ తప్పు**

గతంలో మీకు ఏదైనా క్యాపిటల్ గెయిన్స్ ఉంటే ఐటీఆర్-1 ఫారమ్ ఉపయోగించడం సాధ్యం కాదు. కానీ ఇప్పుడు, కొత్త నిబంధనల ప్రకారం, మీ క్యాపిటల్ గెయిన్స్ స్టాక్స్ లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ నుంచి వచ్చినవి లేదా రూ. 1.25 లక్షల కంటే తక్కువగా ఉంటే, మీరు ఐటీఆర్-1 ఉపయోగించవచ్చు. ఈ మొత్తం రూ.1.25 లక్షలను మించితే లేదా మీకు క్యారీ ఫార్వర్డ్ లాసెస్ ఉంటే, ఐటీఆర్-1 ఉపయోగించడం చెల్లదు. అలా చేస్తే, మీ రిటర్న్ తప్పుగా పరిగణించబడుతుంది. ఆదాయపు పన్ను శాఖ ఈ తప్పును త్వరగా గుర్తించి, 15 రోజుల్లో సరిచేయమని నోటీసు పంపుతుంది.

**నోటీసు విస్మరిస్తే ఏమవుతుంది**

మీరు నోటీసుకు స్పందించకపోతే లేదా సమయానికి తప్పును సరిదిద్దకపోతే, ఆదాయపు పన్ను శాఖ మీ రిటర్న్‌ను ఫైల్ చేయనట్టుగా భావిస్తుంది. దీని వల్ల మీకు పెనాల్టీలు విధించబడవచ్చు. మీ రిఫండ్ రావడంలో చాలా ఆలస్యం జరుగుతుంది.

**డిఫెక్టివ్ రిటర్న్‌ను సరిచేయడం ఎలా?**

రివైజ్డ్ రిటర్న్ ఫైల్ చేయడం: మీ ఒరిజినల్ రిటర్న్ ఇంకా ప్రాసెస్ కాకపోతే, ఆదాయపు పన్ను పోర్టల్‌లో లాగిన్ అవ్వండి. రివైజ్డ్ రిటర్న్ ఆప్షన్ ఎంచుకుని, సరైన ఫారమ్‌ను సబ్మిట్ చేయండి

త్వరగా ఈ-వెరిఫై: రివైజ్డ్ రిటర్న్ ఫైల్ చేసిన తర్వాత, 30 రోజుల్లో ఆధార్ OTP, నెట్ బ్యాంకింగ్ లేదా డిజిటల్ సిగ్నేచర్ ఉపయోగించి ఈ-వెరిఫై చేయండి. ఇది చేయకపోతే మీ రిటర్న్ చెల్లదు

ప్రాసెస్ అయిన రిటర్న్‌ను సరిదిద్దండి: ఒకవేళ మీ రిటర్న్ ఇప్పటికే ప్రాసెస్ అయి ఉంటే, సెక్షన్ 154 కింద పోర్టల్‌లో రెక్టిఫికేషన్ అభ్యర్థన సబ్మిట్ చేయడం ద్వారా చిన్న తప్పులను సరిచేయవచ్చు.

డెడ్‌లైన్‌లను పాటించండి: రివైజ్డ్ లేదా రెక్టిఫైడ్ రిటర్న్‌లను అసెస్‌మెంట్ ఇయర్ (మార్చి 31, 2026, FY 2024-25 కోసం) ముగిసేలోపు లేదా ఒరిజినల్ రిటర్న్ ప్రాసెస్ అయ్యేలోపు సబ్మిట్ చేయాలి.

నోటీసులకు వెంటనే స్పందించండి: సెక్షన్ 139(9) కింద నోటీసు వస్తే, వీలైనంత త్వరగా స్పందించాలి. అవసరమైతే, ఆన్‌లైన్‌లో ఎక్స్‌టెన్షన్ కోసం అభ్యర్థించవచ్చు. మీకు విదేశీ ఆదాయం లేదా విభిన్న రకాల క్యాపిటల్ గెయిన్స్ వంటి సంక్లిష్టమైన కేసులు ఉంటే, టాక్స్ ఎక్స్‌పర్ట్ లేదా చార్టర్డ్ అకౌంటెంట్ సహాయం తీసుకోవడం మంచిది.

